

స్వార్థం





నందం రామారావు

ఉదయం పది గంటల వేళ.

బజారు వచ్చేపోయే కార్లతో, రిక్షాలతో, హడావుడిగా సాగిపోయే మనుషులతో విపరీతమైన సందడిగా వుంది!

తన షాపులో కూర్చుని క్రొత్త మందుల పాకెట్స్ వూడదీసి సీసాలు బయటకు తీస్తున్నాడు ప్రసాద్

ఇంతలో కీచుమన్న చప్పుడు.

ఆ వెంటనే కెవ్వుమన్న అరుపు ఒకదాని వెంట ఒకటి వినిపించగా రోడ్డు వేపు చూశాడు ప్రసాద్

రోడ్డుమీద ఒక కారు ఆగి వుంది. దాని చుట్టూ జనం.

ఏం జరిగిందో అన్న కుతూహలం కలిగింది ప్రసాద్‌కి పని కుర్రాడికి మందుల పాకెట్స్ అప్పజెప్పి రోడ్డుమీద కొచ్చాడు.

ఎండలో మిలమిలా మెరిసిపోతోంది ఎర్రటి ఖరీదైన కారు ఆ కారులో అంత కన్నా ఖరీదైన మనుషులు.

ఆ ఎర్రటి కారు ముందు, ఎర్రటి రక్తంలో పదేళ్ల కుర్రాడు!

ఆ కుర్రాడి ఒంటికి చిరిగిన బట్టలు. శరీరంలో ఎముకలు తప్ప మాంసం లేదు. పుట్టిన తరువాత నూనె ఎరగని జుట్టు;

వాడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి అయిదు నిముషాలయింది.

"ఈ కారుల్లో వెళ్లే వారికి మామూలు మనుషులు దోమల్లానో; చీమల్లానో కన్పిస్తారు. కారున్న బాబులందర్నీ నడి రోడ్డుమీద నిలబెట్టి, షూట్ చెయ్యాలి." కారుల్లో వెళ్లే ధనవంతులమీద తమకున్న కసిని తీర్చుకుంటున్నారు కొంతమంది.

ఇదంతా చూస్తూ కారులో కూర్చున్న ఓ రంగుల రామచిలుక—

"వాటీజ్ దిస్ న్యూసెన్స్ డియర్" అంటోంది ముద్దు ముద్దుగా.

"ఏంలేదు డియర్! ఎవడో వెధవ మన కారు క్రింద పడ్డదానికి ఈ న్యూసెన్స్ చేస్తున్నారు"

"దానికింత న్యూసెన్సా? మనకవతల పార్టీకి టైమవుతోంది డియర్"

"ఒక్క నిముషం వుండు డార్లింగ్."

ప్రసాద్ వాళ్ల మాటల్ని ఆశ్చర్యంగా వింటున్నాడు.

ఇంతలో ఎక్కడి నుంచో కానిస్టేబుల్ వచ్చాడు వచ్చి ఏదో రాసుకున్నాడు రాసుకున్న తర్వాత కారు స్టార్టవబోయింది!

ఇంతలో ఒకామె పెద్దగా ఏడుస్తూ జనాన్ని తోసుకుని వచ్చింది

ప్రసాద్ ఆమె వేపు చూశాడు.

ఆమె కట్టుకున్న చీర మాసింది. ముఖం కమిలింది.

రంగు వెలిసిన బొమ్మలా వుంది రక్తపు మడుగులో చనిపోయివున్న ఆ కుర్రాడిని చూసి ఏడుస్తోంది.

"అయ్యో! కొడకా. నీకప్పుడే నూరేళ్ళు నిండాయా? నిన్ను సంపడానికి ఏ వెధవకు చేతులొచ్చాయో. ఇంక నేనేం చూసుకుని బతికేది నాయనోయ్" అంటూ శోకాలు పెడ్తోంది.

ఆమె ఏడుపు అక్కడున్న వాళ్ళ హృదయాల్ని ద్రవింపజేస్తోంది. ప్రసాద్ ఆ తల్లి బాధ చూడలేక పోయాడు. 'ఆ క్షణాన ఆ కారులో వున్న వ్యక్తుల్ని బయటకు లాగి అంత అశ్రద్ధగా కారును తోలినందుకు నడి రోడ్డులో నిలబెట్టి వురితియ్యాలనిపించింది!

కానిస్టేబుల్ ఆ కారు దగ్గరికి వచ్చి ఆ వ్యక్తితో ఏదో మాట్లాడాడు.

కారు స్టార్టయి వెళ్ళిపోయింది!

"అదేవిటండీ కానిస్టేబుల్‌గారూ! వాళ్ళని అలా వదలిపెట్టారు?" ఎవరో అడిగారు.

"ఎక్కడికి పోతాడండీ పేరు రాసుకున్నానుగదా!" అన్నాడు కానిస్టేబుల్.

పసాద్‌కి ఎందుకో ఆ సమాధానం రుచించలేదు.

ఒక కుర్రాడిని రోడ్డుమీద చంపిన ఆ కారుగల వ్యక్తి ఎంత గొప్పవాడైనా కావచ్చు. కానీ, వాడు హంతకుడే! హంతకుడిని అలా వదిలిపెటడమా?

"బాబూ! ఇంక నేను బతికుండటం ఏందుకురా. నన్నూ సంపెయ్యరా" అంటూ ఆ శవాన్ని ఎత్తుకుంది ఆ తల్లి.

"అదేవిటండీ అలా తీసుకుపోతోంది కుర్రాడిని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి పోస్టుమార్టమ్ చేయించరా?"

ఆ మాట విన్న కానిస్టేబుల్ ఆమె దగ్గరకెళ్ళి— "ఏయ్! శవాన్ని దింపు. ఇప్పుడిప్పుడే శవాన్ని తీసుకెళ్ళడానికి వీల్లేదు" అన్నాడు.

"బాబూ! జరిగిందేదో జరిగిపోయింది. నాకీ కేసులూ, కోర్టులూవద్దు. నాబిడ్డను

స్వార్థం

నాకివ్వండి ఈ సేతుల్తో పెంచాను. ఈ సేతుల్తో బుగ్గిసేత్తాను" అంటూ బతిమలాడసాగింది

"సరే. పో!" అన్నాడు కానిస్టేబుల్.

ఆ స్త్రీ కుర్రాడిని భుజంమీద వేసుకుని ఏడుస్తూ వెళ్ళిపోయింది.

కానిస్టేబుల్ కూడా అటూ యిటూ కాసేపు తిరిగి వెళ్ళిపోయాడు.

ప్రసాద్‌కి ఇందులో ఏదో అసహజత్వం కనిపించింది. అక్కడ్నుంచి కదిలి తన షాపులోకొచ్చాడు, జనం కూడా అక్కడ్నుంచి కదిలి ఎవరి పనిమీద వాళ్ళు వెళ్ళిపోయారు! మరునిముషంలో అంతా మామూలుగా అయిపోయింది!

క్షణం క్రితం అక్కడ యాక్సిడెంట్ జరిగిందన్న విషయమే మర్చిపోయారు అక్కడున్న మిగతా జనం! కానీ, ప్రసాద్ తన షాప్‌లో కూర్చుని యాక్సిడెంట్ గూర్చే ఆలోచించసాగాడు!

ఇంతలో రోడ్డుమీద పెద్దగా ఏడ్పు వినిపించింది.

ప్రసాద్ ఆశ్చర్యంగా అటుకేసి చూశాడు.



ఎవరో స్త్రీ గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. కానీ, రోడ్డుమీదున్న జనం ఎవరూ ఆ స్త్రీ ఏడుపుని పట్టించుకోవడం లేదు

ప్రసాద్ చూస్తూ ఊరుకోలేకపోయాడు. లేచి ఆమె దగ్గరకెళ్ళాడు.

"ఎవరమ్మా నువ్వు! ఏందుకేడుస్తున్నావ్?"

"నా పేరు లచ్చమ్మ బాబూ; నాకొడుకు కారుక్రింద పడ్డాడుట నాయనా. ఎక్కడ పడ్డాడో నీకు తెలుసా బాబూ."

ప్రసాద్ ఆశ్చర్యపోయి—

"నీ కొడుకు కారు క్రింద పడ్డాడా?" అన్నాడు.

'అవును బాబూ! నా కూతురూ, కొడుకూ నూకలు కొనుక్కొత్తానికి బజారు కొచ్చారు బాబయ్యా ఆడు రోడ్డుదాటబోయి కారుకింద పడ్డాడట. నా పిల్లొచ్చి సెప్పినాది బాబయ్యా. ఆపట్నాన పరిగెత్తుకొచ్చినా. నువ్వు సూశావా బాబూ."

ఈ మాటలు విన్న ప్రసాద్‌కు నోట మాట రాలేదు! లచ్చమ్మవైపు చూశాడు. ఏముకలలాటి శరీరం చీలికలై వ్రేలాడుతున్న చీర. చింపిరి తలలో పెట్టుకున్న పిచ్చి పువ్వులా వుంది, లచ్చమ్మ!

"ఏంటి బాబూ! మాట్లాడవే?"

"అవునిక్కడే యాక్సిడెంట్ జరిగింది. ఒక కుర్రాడు కారుకిందపడి చనిపోయాడు."

ఆ మాట వింటూనే లచ్చమ్మ పెద్దపెట్టున ఏడ్వసాగింది—

"నా నాయనే! నీ కప్పుడే నూరేళ్ళు నిండిపోయినాయా? మీ అయ్య పోయినా నిన్ను సూసుకునే కదరా బతుకుతున్నాను తండ్రీ! ఇంక నేనెందుకు బ్రతికేది?" అంటూ ఏడుస్తూనే— "ఆడి శవం ఏది బాబయ్యా" అడిగింది లచ్చమ్మ.

"ఇందాక ఎవరో ఒకావిడ వచ్చి తన కొడుకుదని తీసుకెళ్ళిందే."

"బాబూ! నా కొడుకుని అదెవత్తో తీసికెళ్ళడమేమిటి? నాయనోయ్! నేనిప్పుడు ఏం సెయ్యను దేవుడోయ్. నాకెన్ని కట్టాలు రాశావ్రా దేవుడోయ్,"

ప్రసాద్ కిదంతా వింతగా అన్పించింది. ఒక కుర్రాడికి ఇద్దరు తల్లులా?

ఇటువంటి విచిత్రాలను గురించి కథల్లో చదివాడు. కానీ, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాడు!

ఎవరా కుర్రాడికి నిజమైన తల్లి?

"చూడమ్మా? ఇప్పుడు ఏడిస్తే లాభం లేదు. నిజంగా అతను నీ కొడుకైతే పోలీసులతో చెప్పు" అన్నాడు ప్రసాద్.

"పోలీసోల్లు నా మాట ఇంటారా బాబూ?"

"ఎందుకు వినరు? వెళ్ళి చెప్పు?"

"బాబూ! మీరూ రండయ్యా" లచ్చమ్మ బతిమాలింది.

"అబ్బే! నేనెందుకు. నువ్వెళ్ళు. నీమాట వింటారు?" అని సలహాయిచ్చి షాపులో కొచ్చేశాడు ప్రసాద్

లచ్చమ్మ ఏడుస్తూ కాసేపు అక్కడే కూర్చుని మెల్లగా లేచి అక్కడ నుంచి కదిలింది

ప్రసాద్‌కి ఈ అనవసర గొడవను నెత్తి మీద వేసుకోవడం ఇష్టంలేదు. అందులోనూ పోలీసుల్తో వ్యవహారం! ఎందుకొచ్చిన బెడద? అని అనుకున్నాడు.

సాయంత్రం అయిదు గంటలయింది.

ప్రసాద్ మెయిన్ బజారు కెళ్ళి తన పని చూసుకుని బస్సుకోసం బస్‌స్టాప్ దగ్గరకొచ్చి నుంచున్నాడు, ఇంతలో రోడ్డు ప్రక్కనుంచి—

"బాబూ! అనాధశవం బాబూ! దహనానికి పైసల్లేవు బాబూ— ధర్మం చెయ్యండి బాబూ" అన్న అరుపులు వినిపించాయి.

ఆ గొంతు ఎక్కడో విన్నట్టుగా అనిపించి ప్రక్కకు తిరిగి చూశాడు ప్రసాద్.

రోడ్డు ప్రక్కన శవాన్ని పెట్టుకుని ఒక

సూ ర్యు డు

నిన్న
ప్రపంచంలో లేని
నీతి, న్యాయం
ఈ రోజు
ఉన్నాయేమోనని
పరిశీలిస్తూ
రోజు రోజూ భంగపడినా
రోజు రోజు వచ్చి చూసే
ఆశావాది
సూర్యుడు !

— కాశీనాథ & కాశీనాథ

ఆడా, ఒక మగా కూర్చుని వున్నారు.

ప్రసాద్ పావలా వేసివచ్చి మళా బస్సు స్టాపులో నిలబడ్డాడు.

ఎందుకో ఆ శవం వేపు, ఆ మనుషుల వేపు చూశాడు. వాళ్ళను ఎక్కడో చూశాడు. ఎక్కడా అని ఆలోచిస్తూండగానే,

మగమనిషి —

"ఒక పావలా ఇయ్యి టీ తాగొత్తా. అరచీ, అరచీ గొంతు పోతోంది" అంటున్నాడు.

"సాల్లే ! ఎన్నిసార్లు టీ తాగుతావ్ ? ఇప్పటికే ఈ వచ్చిన డబ్బుల్లో శానా బొక్కడింది ఆ పోలీసోడు పాతిక గుంజుకు పోయాడు. ఎదవసచ్చినోడు."

"తీసుకుంటే తీసుకున్నాడులేవే. మనకు బంగారంనాటి శవం ఇచ్చాడుగందా."

"అదీ నిజమే. ఇయ్యాల ఏప్పుడూ లేనన్ని పైసలొచ్చాయి. దీన్తో నాకో సన్న కోక, నీకో సొక్కా, మిగతా దాంతో సినిమా ... సారా"

"సరేలే! ఎవుడన్నా ఇంటాడు వూరుకో."

వాళ్ళు మాట్లాడుకుంటూ వుండగానే గాలికి శవం మీదున్న గుడ్డ తొలగింది !

ఆ శవాన్ని చూస్తూనే ఆశ్చర్యపోయాడు ప్రసాద్. అది ప్రొద్దున్న కారు క్రిందపడ్డ శవం !

అవును ! ప్రొద్దున్న ఈ శవాన్ని పట్టుకెళ్ళింది ఈ స్త్రీయే !

ఐతే ...ఇందాక మరో స్త్రీ వచ్చి...

ప్రసాద్ కిదంతా విచిత్రంగా అనిపించింది.

అతని కళ్ళముందు లచ్చమ్మ దీనమైన ముఖం మెదిలింది. ఆమె ఏడ్చిన ఏడుపు చెవుల్లో మార్మోగ సాగింది.

మనుష్యులు రకరకాల వ్యాపారాలు చెయ్యడం విన్నాడు. ఇప్పుడు శవాలతో వ్యాపారం చెయ్యడం చూస్తున్నాడు !

మనుషులెంత స్వార్థపరులు ?

వెంటనే ప్రసాద్‌కి ఎవరో వెన్నుతట్టి పిలిచినట్టు స్ఫురించింది.

తను మాత్రం ఏంచేశాడు ?

పోలీస్‌స్టేషన్‌కొచ్చి సహాయం చేసిపెట్టమని లచ్చమ్మ ఎంత ప్రాధేయపడినా, తను ఎందుకొచ్చిన గొడవ అనుకొని, తప్పుకున్నాడే గానీ, ఆ మాతృ హృదయాన్ని అర్థం చేసుకోలేకపోయాడు !

తను మాత్రం మనిషిగా ప్రవర్తించాడా?

ఈ ఆలోచన రాగానే ప్రసాద్ సిగ్గుతో తల దించుకున్నాడు !

ఇది మీకు చాలా ఉపయోగం

మానిత్య వ్యవహారాలకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనాఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్ద ఎలా పైసెన్సు తీసుకోవాలి, వివిధజాతుల వివాహ, విడాకులని బంధనలు, స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, ఎవరితోనైనా ప్రమాదం రాబోతే పోలీసురక్షణకు ఎవరికెలావ్రాయాలి, ప్రభుత్వ ఉచితఇండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలాధరఖాస్తువ్రాసిపంపుకోవాలి, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలావ్రాయాలి వాటివివిధ నమూనాలు, అనేక-చట్టాలవివరాలు ఇలాంటివెన్నో మీకుఉపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300పేజీలపుస్తకం ధర రూ. 12 పోష్టుఖర్చులదనం. దేశసేవప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగలరావు నగరువద్ద, హైదరాబాదు-500890 కు ఉత్తరంవ్రాసి మీఉపయోగానికోపుస్తకం వి పి పోష్టుద్వారా పొందండి